అసెంబ్లీ మీడియా కమిటీని ఏర్పాటు చేయాలి

నల్లకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ మీడియా కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, అర్హులైన మీడియా ప్రతినిధులకు ఎంట్రీ పాస్ ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శికి లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా చాలా కమిటీలు మార లేదని, జీవోల సమీక్ష పేరుతో కొత్త కమిటీలు వేయకుండా, నూతన అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.

జర్నలిస్టు పల్లె రవికుమార్‌కు పరామర్శ

నల్లకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పల్లె రవికుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు జారిపడి చికిత్స పొంది, ఇంట్లో ఉంటున్న ఆయనను గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పరామర్శించారు. పల్లె రవికుమార్ ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనందం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

18న ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

నల్లకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని, ఈ నెల 18న అసెంబ్లీలో ప్రవేశపెట్టే వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో మాల ఎమ్మెల్యేలు ఎండగట్టాలని జైభీమ్ సేన రైట్ ఫర్ ప్రొటెక్షన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు, జాతీయ మాలల జేఏసీ ఉపాధ్యక్షుడు ఎన్ఈ.మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 18న ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

'ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి'

నల్లకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష్ తీవ్రంగా ఖండించారు. గురువారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ జగదీ‌ష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన వెంటనే దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జగదీ‌ష్‌రెడ్డి పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఎంసీహెచ్ కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర

అంబర్‌పేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ గురువారం ఎంసీహెచ్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. బస్తీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ప్రధానంగా లోప్రెషర్, వీధిదీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.జ్యోత్స్నకు గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డును అందుకున్న టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాచిగూడకు చెందిన టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, ప్రొఫెసర్ తిరునగరి జ్యోత్స్న టాప్-20 గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ఎక్స్‌లెన్స్-2025 అవార్డును అమెరికాలోని వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హాల్‌లో అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా నాయకత్వం, వారి సంకల్పం, శక్తీకరణను ప్రోత్సహించే దిశగా 13వ వార్షిక అమెరికన్ మల్టీ ఎథ్నిక్ కమిషన్(ఏఎంఈసీ) కాంగ్రెస్ అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేసింది.

ముఠా సరోజకు బీఆర్ఎస్ నేతల సన్మానం

ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆధ్యాత్మిక, సోషల్ వర్కర్ ముఠా సరోజను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, బీఆర్ఎస్ ముషీరాబాద్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు కిరణ్, పూసగోరక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

గోల్నాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్నాక డివిజన్ కృష్ణానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్‌సిటీ కార్యదర్శి వరలక్ష్మి మహిళలతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ, భద్రత, ఉపాధి కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో వేధింపులను అరికట్టాలని కోరారు. మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయిని నియంత్రించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షబానా, ఉష, స్థానికులు పాల్గొన్నారు.

మాతా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా నీలా శ్రీధర్

చిక్కడపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మాతా వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా ప్రముఖ సంఘసేవకుడు డా.నీలా శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ పక్షాన సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటానని తెలిపారు. ప్రజలకు వాకింగ్ వల్ల కలిగే లాభాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ లింగా ప్రకాష్‌గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌పీఆర్‌డీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురైన ఎన్‌పీఆర్‌డీ(వికలాంగుల హక్కుల జాతీయ వేదిక)-ఇండియా వ్యవస్థాపకులు తుడుం రాజేందర్‌ను ఆపరేషన్ అనంతరం గురువారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పరామర్శించారు. చిక్కడపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రాజేందర్ వద్దకు ఎమ్మెల్యే వెళ్లి, ఆయన ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ రాంనగర్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ప్రభాకర్ పాల్గొన్నారు.

16న శ్రీసత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు శ్రీఆంజనేయ సేవా సమితి ప్రతినిధి డీఆర్ఎస్.నరేంద్ర తెలిపారు. నింబోలిఅడ్డలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ వ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏప్రిల్ 6న సీతారామకల్యాణ మహోత్సవం

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో జరిగే శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ ముహూర్త నిర్ణయ పత్రికను రాశామని ఆలయ చైర్మన్ జానకి సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు. బుధవారం సాయంత్రం వారు ఆలయంలో మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా ఈ కల్యాణ పత్రికను ఆలయ వేదపండితులు రాశారన్నారు. ప్రతి ఏటా ఆలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

అంబర్‌పేట నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 6వ తేదీన అంబర్‌పేట నుంచి శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తెలిపారు. గురువారం కాచిగూడ వీరన్నగుట్టలోని శ్రీశ్యామ్‌బాబా మందిర్ ప్రాంగణంలో శ్రీరామనవమి ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఏప్రిల్ 6న శోభాయాత్ర ప్రారంభమవుతుందని, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమే‌ష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సి.కృష్ణగౌడ్, కోశాధికారి ఏ.సూర్యప్రకా‌ష్‌సింగ్, అధికార ప్రతినిధి చిట్టి శ్రీధర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పురుషోత్తమ్, మల్లికార్జున్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హోలీ సందడి!

ముషీరాబాద్‌లో జోరుగా హోలీ రంగుల అమ్మకాలు



జోరుగా రంగుల అమ్మకాలు

ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ అంటేనే అందరూ కలిసిమెలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకునే పండుగ. ముషీరాబాద్ నియోజకవర్గంలో హోలీ సంబరాలు ఒక్క రోజు ముందుగానే మొదలయ్యాయి. ఫుట్‌పాత్‌లపై తాత్కాలికంగా వెలిసిన దుకాణాలు, షాపుల ముందు ఏర్పాటు చేసిన రకరకాల రంగులను ప్రజలు కొనుగోలు చేశారు. వివిధ రకాల రంగులను ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయించారు. కిలో రంగు ప్యాకెట్ రూ.60 నుంచి రూ.120 అమ్మారు. చిన్నచిన్న డబ్బాలలో సైతం గులాల్ రంగును ప్యాక్‌చేసి రూ.10 నుంచి రూ.100 వరకు విక్రయించారు. రంగులు చల్లే సామాగ్రి చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. రంగునీళ్లను పిచికారీ చేసేందుకు తుపాకి, బెలూన్స్, డబ్బాలను రూ.60 నుంచి రూ.200 వరకు విక్రయించారు. స్పైడర్ మెన్, వాటర్ బాటిల్, ఏకే 47 తదితర రూపాల్లో ఉన్న ఆట పరికరాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. సహజ సిద్ధంగా తయారు చేసిన హెర్బల్ రంగులు ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి, రూ.250 గ్రాముల నుంచి కిలో ప్యాకేజీ వరకు విక్రయించారు. గులాల్ రంగులో ఉండే హెర్బల్ కలర్లను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.



చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం చౌరస్తాలో గురువారం రాత్రి కాముని దహన కార్యక్రమం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్, రాంనగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ తదితరులు

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

చిక్కడపల్లిలో షాప్‌ల ఏర్పాటు



చిక్కడపల్లిలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళ

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా రంగులు, సురేర్, గులాల్ అమ్మే షాప్‌లు చిక్కడపల్లిలో వెలిశాయి. ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి నారాయణగూడ వెళ్లే దారిలో చిక్కడపల్లి బస్టాండ్, వెంకటేశ్వరాలయం కమాన్, చందనబ్రదర్స్ వద్ద హోలీ రంగుల అమ్మకాలు జరుగుతున్నాయి. చిక్కడపల్లిలోని బందర్ మిఠాయి భండార్ తదితర స్వీట్ షాప్‌లలో కొనుగోళ్లు పెరిగాయి.

హోలీపై పోలీసుల ఆంక్షలను ఉపసంహరించుకోవాలి : బీజేపీ



నగర పోలీసు కమిషనర్ సీ.వీ.ఆనంద్‌ను కలిసిన లంకల దీపక్‌రెడ్డి తదితరులు

బర్కత్‌పుర: హోలీపై పోలీసులు విధించిన ఆంక్షలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పలువురు బీజేపీ నేతలతో నగర పోలీసు కమిషనర్ సీవీ.ఆనంద్‌ను కలిసి విన్నవించారు. హోలీ పండగ సందర్భంగా పోలీసులు రకరకాల ఆంక్షలు పెట్టారని దీనివల్ల హోలీ పండగ జరుపుకోవడానికి ప్రజలు, యువతీ, యువకులు, విద్యార్థులు భయపడుతున్నారని తెలిపారు. వెంటనే ఆంక్షలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, ప్రధాన కార్యదర్శి సి.కృష్ణగౌడ్, ఓబీసీ మోర్చా నగర ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, నాయకులు ప్రేమ్‌కుమార్, గంగరాజు, పవన్, లక్ష్మీస్వరూపగౌడ్, రాహుల్‌చంద్ర తదితరులు ఉన్నారు.

చేనేత అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు తదితరులు

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చేనేత అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లను కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు రాష్ట్రంలో ఉన్న కార్మికులందరికీ ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చేసిన తర్వాత గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 32 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకుంటే కనీసం సీఎం, చేనేత శాఖ మంత్రి ఆ కుటుంబాలను ఆదుకోలేదని విమర్శించారు. ఆత్మహత్యలు చేసుకున్న నేతన్నల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికులకు వాగ్దానాల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ సంవత్సరం బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లలను కేటాయించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం శాంతికుమార్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నూతన సంస్కరణలను వ్యతిరేకించాలి: పీడీఎస్‌యూ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పురుషోత్తం, పీడీఎస్‌యూ నేతలు

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ నూతన సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలలో గవర్నర్ల ద్వారా నేరుగా వీసీల నియామకాలను చేపట్టడం అంటే యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని హక్కులను కాలరాయడమేనని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం పేర్కొన్నారు. గురువారం పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో యూజీసీ నూతన సంస్కరణలకు వ్యతిరేకంగా వివిధ యూనివర్సిటీలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో 90 శాతం మంది పేద వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులు ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదువుకుంటున్నారని యూజీసీ నూతన సంస్కరణలు ఉన్నత విద్యను వీరికి దూరం చేయనున్నాయని అన్నారు. పీడీఎస్‌యూ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇ.విజయ్‌కన్నా మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు యూజీసీ అభివృద్ధి నిధులు కేటాయించి విద్యార్థులకు తోడ్పాటు అందించలేదన్నారు. కానీ గత పదేళ్ల బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫెలోషిప్ల కోత పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి సుల్తానా, నాయకుడు కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మొల్ల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి




ట్యాంక్‌బండ్‌పై ఉన్న మొల్ల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాష్ట్రీయ కుమ్మరి సంఘం నేతలు

కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆధ్మాత్మికత, మానవతకు మహిళా సాధికారతకు ఐక్యతకు నిదర్శనం మొల్ల అని పలువురు వక్తలు కొనియాడారు. నేటి సమాజం యువత మొల్లను ఆదర్శంగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆమె విగ్రహం వద్ద గురువారం మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య హాజరై ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సావిత్రీ బాయిపూలే జయంతిని అధికారికంగా నిర్వహించినట్లే ప్రభుత్వం మొల్ల జయంతిని కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు టి.యాదగిరి, మలికంటి వెంకన్న, రాష్ట్రీయ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపెల్లి మహేందర్, మువ్వల అశోక్, లక్ష్మీనారాయణ, కామిశెట్టి రాజేందర్, జగన్, మల్లేష్, రవిశంకర్, దామ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

- సినీనటుడు పసునూరి శ్రీనివాసులు



సుజాతకు అవార్డు ప్రదానం చేస్తున్న శ్రీనివాసులు, సుధారాణి తదితరులు

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి పురుషులు కృషి చేయాలని ప్రముఖ సినీనటుడు పసునూరి శ్రీనివాసులు అన్నారు. ప్రగతి మహిళా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సిటీకల్చరల్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసులు ఈ సందర్భంగా సివిల్‌కోర్టు సీనియర్ సూపరింటెంట్ అంజనీకుమారికి నైటింగేల్ ఇండియా సరోజినీదేవి ఎక్సెంట్ అవార్డును, ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు డా.సుజాతకు ధన్వంతి ఎక్సెంట్ అవార్డును బహూకరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు సుధారాణికృష్ణంరాజు, ప్రముఖ పాత్రికేయులు శంకరనారాయణ, భువనరాధ, జూనియర్ బాలు, మౌనశ్రీరాయరావ్, మౌనశ్రీ మల్లిక్, విశ్వేశ్వరరావు, జ్యోతి, ప్రేమ్‌రెడ్డి, అనురాధ, శ్రీలత, రాధ, శివరామ్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుని వాటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీ కవేలిగ్రౌండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'నీవీ' చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పాఠశాల పేరుతో ఉన్న బోర్డును ఏర్పాటు చేయించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, హెడ్‌మాస్టర్ మేడే దేవదాసు, టీచర్లు సౌజన్య, మెరీదా, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలి

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్నును బకాయిదారులు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఆస్తులు సీజ్ చేస్తామని ముషీరాబాద్ సర్కిల్ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ర హెచ్చరించారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని టీఆర్‌టీ కాలనీలో కొనసాగుతున్న రెడ్ బకెట్ బిర్యానీ హోటల్‌కు వెళ్లి ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలని నోటీసు జారీచేశారు. మూడు రోజుల్లో చెల్లిస్తామని యజమాని హామీ ఇవ్వడంతో సీజ్ చేయలేదని ఏఎంసీ తెలిపారు. మొండి బకాయిదారులు 90 శాతం రాయితీ పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సునంద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత వర్గాల సమస్యలను శాసన మండలిలో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యలను శాసనమండలిలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి తమ డిమాండ్ల పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేనేత మగ్గాన్ని అవమానపరిచిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పే వరకూ తాను పోరాడుతానన్నారు. కార్యక్రమంలో నాయకులు బల్ల గీత, కూరపాటి సుమలత, సూజత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

కాంగ్రెస్‌ది నియంతృత్వ పాలన : బీఆర్ఎస్

ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరించివేయడమే కాకుండా అసెంబ్లీలో సైతం ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతు నొక్కుతూ నియంతృత్వ పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అసెంబ్లీలో ప్రజా సమస్యలను, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రశ్నించిన ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అకారణంగా ఈ సెషన్స్ పూర్తయ్యేవరకూ సస్పెండ్ చేయడం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ ధోరణిని తెలియజేస్తుందన్నారు. ఈ చర్యను నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ఇతర ఎమ్మెల్యేలను, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను బలవంతంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శివముదిరాజ్, సుధాకర్ గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, టెంట్‌హౌస్ శ్రీనివాస్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌యాదవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ కేసులు, అరెస్టులకు ఆప్ నేతలు లొంగరు'

కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు, అరెస్టులకు ఆప్ నేతలు లొంగరని ఆమ్‌ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. తప్పుడు కేసులు బనాయించి ప్రజా గొంతుక అయిన ఆప్ నేతలు నహీంపాషా, రాజేందర్ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గురువారం దోమలగూడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ కార్యకలాపాలను అడ్డుకోవడంలో భాగంగానే వారిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కవాడిగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కవాడిగూడలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కవాడిగూడలోని సాయిబాబా దేవాలయం వద్ద బీఆర్ఎస్ నాయకుడు దివ్యాంగుడు కృష్ణగౌడ్‌కు త్రీ వీలర్ స్కూటర్‌ను పంపిణీ చేశారు. కవాడిగూడ బండమైసమ్మనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బీఆర్ఎస్ నేతలు సంతోష్, లవకుమార్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: బీఆర్ఎస్ సీనియర్ నేత ముఠా నరేష్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు రాకేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, గడ్డమీది శ్రీనివాస్, కుమారస్వామి, అరుణశ్రీ, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్: బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.సురేందర్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లో జరిగిన జన్మదిన వేడుకల్లో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై కేక్ కట్ చేశారు.

ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

హెబ్రోన్ చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడి మృతి

చిక్కడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చి ట్రస్టు వ్యవస్థాపకుడు ఎఫ్‌సీఎస్ పీటర్(82) బుధవారం రాత్రి మృతి చెందారు. గాంధీనగర్‌లో నివాసం ఉండే ఆయనకు భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అస్వస్థతగా ఉన్న ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పలువురు క్రైస్తవులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

వైఎస్ విజయమ్మ, షర్మిల నివాళి

మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ, ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల గురువారం ఉదయం హెబ్రోన్‌కు వచ్చి పీటర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. పీటర్ హెబ్రోన్ చర్చి అభివృద్ధికి తీసుకున్న చర్యలు వారు గుర్తు చేసుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో మహిళల హ్యాండ్ బ్యాగ్‌ల చోరీ

బర్కత్‌పుర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళల హ్యాండ్ బ్యాగ్‌లను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన దినేష్ రమేష్ రావు(35) అమరావతి నుంచి కాచిగూడకు బిక్కనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో కుటుంబ సభ్యులతో వస్తున్నారు. మహారాష్ట్రలోని ముత్‌కేడ్ రైల్వే స్టేషన్ వద్ద రమేష్‌రావు భార్య హ్యాండ్ బ్యాగ్‌ను దొంగ లాక్కొని పారిపోయాడు. ఈ హ్యాండ్ బ్యాగులో 8 గ్రాముల బంగారు ఆభరణాలు, ఖరీదైన సెల్‌ఫోన్‌లు, రూ.500 నగదు ఉన్నాయి. మరో సంఘటనలో రాజేంద్రనగర్‌కు చెందిన గోవింద్ నారాయణ రాణీ(49) కుటుంబ సభ్యులతో కలిసి బిక్కనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలో కుమార్తె హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. దానిలో రూ.6 వేల నగదు, డెబిట్ కార్డులు, ఆధార్ కార్డు, బిజినెస్ డాక్యుమెంట్లు ఉన్నాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి నాందేడ్ రైల్వే పీఎస్‌కు, నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.